ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక



**కర్ణాటక లోక్‌సభ బరిలో ముగ్గురు మాజీ సీఎంలు**

2లో..

సంపుటి: 2 | సంచిక: 4 | పేజీలు: 4 | వెల: రూ.3/- | సోమవారం 15 ఏప్రిల్ 2024 | ఎడిటర్: కోట్ల చంద్రకాంత్

# బీజేపీ ఎన్నికల మేనిఫెస్టో విడుదల

**మహిళలు, పేదలు, యువత, రైతుల అభివృద్ధిపై ఫోకస్**

**'సంకల్ప పత్రం' పేరిట విడుదల చేసిన ప్రధాని నరేంద్ర మోదీ**

**వికసిత్ భారత్‌కు నాలుగు స్తంభాలైన మహిళా శక్తి, యువశక్తి, రైతులు, పేదలపై దృష్టిపెట్టామన్న మోదీ**

**గత పదేళ్లలో చేపట్టిన అన్ని కార్యక్రమాలు కొనసాగుతాయన్న రాజ్‌నాథ్ సింగ్**



హైదరాబాద్, ఏప్రిల్ 14 (ప్రభాత ఉదయం): లోక్‌సభ ఎన్నికలు-2024 వేళ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న బీజేపీ ఎన్నికల మేనిఫెస్టో-2024 విడుదలైంది. 'సంకల్ప పత్రం' పేరిట ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం ఉదయం విడుదల చేశారు. పేదలు, యువత, రైతులు, మహిళల అభివృద్ధి 'గ్యాన్' లక్ష్యంగా ఈ మేనిఫెస్టోని రూపొందించారు. వేదికపై అంబేద్కర్, రాజ్యాంగాల ప్రతిమలను ఉంచి మేనిఫెస్టోను ప్రకటించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, బీజేపీ జాతీయాధ్యక్షుడు జేపీ నడ్డా ఉన్నారు. ఢిల్లీలోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. వికసిత్

..మిగతా 2లో



# కాంగ్రెస్‌లోకి ఎవరు వచ్చినా చేర్చుకుందాం

**ముఖ్య నేతల నిర్ణయం**

హైదరాబాద్, ఏప్రిల్ 14 (ప్రభాత ఉదయం): తెలంగాణలో 15 ఎంపీ స్థానాల్లో గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్ నేతలు వ్యూహాలు రచిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం రాత్రి హైదరాబాద్ చేరుకున్న ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ నోవాటెల్‌లో పార్టీ ముఖ్యనేతలతో సమావేశమయ్యారు. తాజా రాజకీయ పరిణామాలు, ప్రచార వ్యూహాలపై చర్చించారు. వచ్చే నెల రోజుల్లో లోక్‌సభ ఎన్నికల ప్రచారం ఎలా ఉండాలి, ఏ ఏ అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలనే అంశాలపై దిశానిర్దేశం చేశారు. కొత్తగా పార్టీలోకి ఎవరు వచ్చినా చేర్చుకోవాలని, స్థానిక నేతలతో సంప్రదించాలని సమావేశంలో నిర్ణయించారు. "కాంగ్రెస్‌లోకి వచ్చే నేతలను అడ్డుకోవద్దు. జిల్లా స్థాయిలో చేరికలకు నియంతలా కొందరు అడ్డొస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల వేళ పార్టీ మారిన వారిని తిరిగి చేర్చుకోవాలి. ఉత్తర భారత్‌లో భాజపా ప్రాభవం తగ్గింది. అందుకే దక్షిణ భారత్‌పై భాజపా ఫోకస్ పెట్టింది. రాష్ట్రంలో భాజపాకు అవకాశం ఇవ్వొద్దు. కష్టపడి పనిచేస్తే రాష్ట్రంలో అన్ని సీట్లు గెలవొచ్చు" అని

..మిగతా 2లో



# స్టేషన్‌ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే రాజయ్యకు కేసీఆర్ కీలక బాధ్యతలు

2

# ఓటు నమోదుకు లాస్ట్ ఛాన్స్



**నేటితో ముగియనున్న గడువు**

హైదరాబాద్, ఏప్రిల్ 14 (ప్రభాత ఉదయం): నేటి వరకు ఓటరుగా నమోదు చేసుకునే అవకాశాన్ని ఎన్నికల సంఘం కల్పిస్తోంది. ఈలోగా దరఖాస్తు చేసిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కును కల్పించనుంది. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు సిద్ధమవుతున్నారా..? అయితే ముందుగా ఓటరు జాబితాలో పేరు ఉందో..? లేదో..? చూసుకోండి. ఒకవేళ ఓటు లేకపోతే మాత్రం ఓటరుగా నమోదు చేసుకునేందుకు ఇప్పటికీ మరో అవకాశం మిగిలే ఉంది. ఈ నెల 15వ తేదీ వరకు

..మిగతా 2లో

# కవితతో కేటీఆర్ ములాఖత్

**కేటీఆర్ వెంట కవిత భర్త అనిల్ కుమార్, న్యాయవాది మోహిత్**



న్యూఢిల్లీ, ఏప్రిల్ 14 (ప్రభాత ఉదయం): లిక్కర్ కేసులో అరెస్టయి ప్రస్తుతం సీబీఐ కస్టడీలో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితతో.. ఆమె సోదరుడు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ములాఖత్ ముగిసింది.దాదాపు గంటన్నర పాటు ఈ ములాఖత్ కొనసాగింది. కేటీఆర్ వెంట కవిత భర్త అనిల్ కుమార్, న్యాయవాది మోహిత్ ఉన్నారు. ఇక.. ములాఖత్ ముగిసిన అనతంరం మీడియాతో మాట్లాడటాన్ని కేటీఆర్ నిరాకరించారు. లాయర్లతో చర్చించాల్సి ఉందని కేటీఆర్ తెలిపారు. ఇక.. ఆదివారం(ఏప్రిల్ 14) కవితను కలిసేందుకు కేటీఆర్ హైదరాబాద్ నుంచి ఢిల్లీ వెళ్లిన విషయం తెలిసిందే. ప్రస్తుతం సీబీఐ కస్టడీలో ఎమ్మెల్సీ కవిత విచారణ కొనసాగుతోంది. రేపటితో కవిత సీబిఐ కస్టడీ ముగియనుంది. నేడు ఉదయం 10 గంటలకు రౌస్ ఎవెన్యూ కోర్టులో కవితను సీబీఐ హాజరు పర్చనుంది. సీబీఐ అధికారుల బృందంలో మహిళా అధికారులు కవితను విచారిస్తున్నారు. లిక్కర్ పాలసీ అక్రమాల్లో కవిత కీలక వ్యక్తి అని సీబీఐ పేర్కొంది. ఆమ్ ఆద్మీ పార్టీకి కవిత వంద కోట్ల ముడుపులు అప్పచెప్పారని సీబీఐ అభియోగం. సౌత్ గ్రూప్ నుంచి డబ్బు సమకూర్చడం, నిందితులు, అప్రూవర్లుగా మారిన వారు ఇచ్చిన

..మిగతా 2లో

# సల్మాన్ ఇంటి వద్ద కాల్పులు



ముంబై, ఏప్రిల్ 14 (ప్రభాత ఉదయం): బాలీవుడ్ నటుడు సల్మాన్‌ఖాన్ ఇంటి బయట ఆదివారం ఉదయం గుర్తుతెలియని వ్యక్తులు కాల్పులు జరిపారు. ముంబైలోని సల్మాన్ నివాసమైన గెలాక్సీ అపార్ట్‌మెంట్స్ ఎదురుగా తెల్లవారుజామున 5 గంటలకు బైక్‌పై వచ్చిన ఇద్దరు వ్యక్తులు నాలుగు రౌండ్లపాటు కాల్పులు జరిపారు. ఇది జరిగినప్పుడు సల్మాన్‌ఖాన్, ఇతర కుటుంబ సభ్యులు అంతా ఇంట్లోనే ఉన్నారని తెలిసింది. తాజా ఘటనతో అక్కడ కలకలం రేగింది. సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకున్నారు. క్రైం బ్రాంచ్ పోలీసులు రంగంలోకి దిగి, దర్యాప్తు ప్రారంభించారు. తుపాకీ కాల్పులు జరిపింది తామేనని గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ సోదరుడు అన్మోల్ బిష్ణోయ్ ప్రకటించాడు. ఈ మేరకు సోషల్‌మీడియాలో సందేశాన్ని పోస్ట్ చేశాడు. ఇది కేవలం ట్రైలర్ మాత్రమేనని హెచ్చరించాడు.



# రిజర్వేషన్లపై అమిత్ షా కీలక ప్రకటన

రాయ్‌పూర్, ఏప్రిల్ 14 (ప్రభాత ఉదయం): రిజర్వేషన్లపై కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా కీలక ప్రకటన చేశారు. తాము మూడోసారి అధికారంలోకి వస్తే రిజర్వేషన్లపై ఏం చేయబోతున్నామనేదానిపై క్లారిటీ ఇచ్చారు. రిజర్వేన్లను భారతీయ జనతా పార్టీ(బీజేపీ)

..మిగతా 2లో

# మరో 10 మందితో కాంగ్రెస్ జాబితా విడుదల

**కన్హయ్య కుమార్, చరణ్‌జిత్ సింగ్ చన్నీలకు టిక్కెట్లు**





న్యూఢిల్లీ, ఏప్రిల్ 14 (ప్రభాత ఉదయం): లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని కాంగ్రెస్ ఆదివారం (ఏప్రిల్ 14) అభ్యర్థుల మరో జాబితాను విడుదల చేసింది. కాంగ్రెస్ అభ్యర్థుల జాబితాలో 10 మంది అభ్యర్థుల పేర్లను ప్రకటించారు. ఈశాన్య ఢిల్లీ నుంచి కన్హయ్య కుమార్‌కు కాంగ్రెస్ టికెట్ ఇచ్చింది. బీజేపీ అభ్యర్థి మనోజ్ తివారీపై కన్హయ్య కుమార్‌ను బరిలోకి దింపింది కాంగ్రెస్. ఇక, ఢిల్లీలోని చాందినీ చౌక్ నుంచి జేపీ అగర్వాల్‌కు, నార్త్‌వెస్ట్ ఢిల్లీ నుంచి ఉదిత్‌రాజ్‌కు టికెట్ ఇచ్చారు. పాటియాలా నుంచి ధరమ్‌వీర్ గాంధీ, సంగ్రూర్ నుంచి సుఖ్‌పాల్ సింగ్ ఖైరా, అమృత్‌సర్ నుంచి గుర్జిత్ ఔజ్లా, జలంధర్ నుంచి చరణ్‌జిత్ సింగ్ చన్నీ, అలహాబాద్ నుంచి ఉజ్వల్ రేవతి రమణ్‌సింగ్‌లకు కాంగ్రెస్ టికెట్లు ఇచ్చింది. మరోవైపు ఎన్నికలకు సమయం దగ్గర పడుతుండటంతో మరి కొన్ని చోట్ల టికెట్ల కోసం ఆశావాహుల్లో టెన్షన్ కొనసాగుతోంది.

# బీజేపీ ఎన్నికల మేనిఫెస్టో విడుదల




**మొదటి పేజీ తరువాయి...**

భారత్‌కు నాలుగు స్తంభాలైన మహిళా శక్తి, యువశక్తి, రైతులు, పేదలపై మేనిఫెస్టో దృష్టి సారించిందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఈ మేనిఫెస్టో జీవితాలకు గౌరవమని, జీవన నాణ్యత అని మోదీ వ్యాఖ్యానించారు. బీజేపీ మేనిఫెస్టో అవకాశాల పరిమాణం, నాణ్యతపై దృష్టి సారిస్తుందని చెప్పారు. అన్నీ గ్యారంటీలను నెరవేర్చే హామీ 'మోదీ కీ గ్యారంటీ' అని బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా అన్నారు. 'మోదీ కీ గ్యారంటీ' బీజేపీ ఎన్నికల నినాదం అని ఆయన అన్నారు. గ్రామీణ భారతం అభివృద్ధికి మోదీ ప్రభుత్వం ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందని అన్నారు. గత దశాబ్ద కాలంలో బీజేపీ ప్రభుత్వం సాధించిన విజయాలను ఆయన వివరించారు. నరేంద్ర మోదీ నాయకత్వంలో రాబోయే ఐదేళ్లలో చేయబోయే అభివృద్ధి, దేశానికి ఎలా సేవ చేయాలనే దానిపై చర్చిస్తామని చెప్పారు. లోక్‌సభ ఎన్నికల మొదటి దశ పోలింగ్ మరో వారం రోజుల్లో జరగనున్న నేపథ్యంలో మేనిఫెస్టోని విడుదల చేయడం గమనార్హం. ఇక గత పదేళ్లలో మోదీ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు కొనసాగుతాయని ఆ పార్టీ అగ్రనేత, రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ చెప్పారు. ప్రధాని మోదీ నాయకత్వంలో బీజేపీ తమ వాగ్దానాలన్నింటినీ నెరవేర్చుతుందన్నారు. గత పదేళ్లలో మోదీ నాయకత్వంలో దేశప్రజలకు చేసిన ప్రతి వాగ్దానాన్ని నెరవేర్చినందుకు తాను సంతోషిస్తున్నానని, చాలా సంతృప్తికరంగా ఉన్నానన్నారు. 2014 సంకల్ప పత్రమైనా, 2019లో ఇచ్చిన హామీలైనా ప్రతి ఒక్కదాన్ని నెరవేర్చామని చెప్పారు. 'మోదీ కీ గ్యారంటీ' 24 క్యారెట్ల అంత నాణ్యమైనదని రాజ్‌నాథ్ సింగ్ వ్యాఖ్యానించారు.



## రామన్నగూడెంలో ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు

నెల్లికుదురు ఏప్రిల్ 14 (ప్రభాత ఉదయం): నేటి యువతరం డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్‌ని ఆదర్శంగా తీసుకోవాలని, మహబూబాబాద్ జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కాసం లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. నెల్లికుదురు మండలం రామన్నగూడెం గ్రామంలో కాసం లక్ష్మారెడ్డి అధ్వర్యంలో అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల సమర్పించిన అనంతరం కాసం లక్ష్మారెడ్డి మాట్లాడుతూ అంబేద్కర్ దేశానికి మార్గదర్శకుడు అని, దేశంలోని ప్రతి రాజకీయ పార్టీపై అంబేద్కర్ ప్రభావం ఉంటుందని, ఆధునిక భారతదేశాన్ని రూపొందించడంలో అంబేద్కర్ కీలక పాత్ర పోషించారని లక్ష్మారెడ్డి తెలిపారు. ఈ జయంతి వేడుకలలో కాసం లక్ష్మారెడ్డి, కొయ్యేడి సోమయ్య(చీకటి సోమయ్య), అషోద యాకూబ్, మల్లెపల్లి వెంకన్న, కాశమల్ల వెంకన్న, పెద్ద పాశం యాకయ్య, బండపెల్లి వెంకన్న, మల్యాల అశోక్, కర్నె ఉప్పలయ్య, కాశమల్ల అన్వేష్, పల్లె రాజు, పల్లె వంశీ, గ్రామస్థులు పాల్గొన్నారు.



## అంబేద్కర్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలి

గద్వాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 14 (ప్రభాత ఉదయం): బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఎనలేని కృషి చేసిన మహనీయుడు భారతరత్న డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ అని జిల్లా కలెక్టర్ బి.ఎం. సంతోష్ అన్నారు. ఆదివారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా షెడ్యూలు కులముల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 133వ జయంతి వేడుకలకు జిల్లా అదనపు కలెక్టర్ అపూర్వ చౌహాన్ తో కలిసి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బడుగు, బలహీన, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం భారత రాజ్యాంగాన్ని రూపకల్పన చేసి అందరికీ సమాన హక్కులు కల్పించిన మహోన్నత వ్యక్తి అంబేద్కర్ అని అన్నారు. మహిళల హక్కుల కోసం, వారి చదువు కోసం అంబేద్కర్ ఎంతో కృషి చేశారని అన్నారు. ఆయన చదువుకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చారని, ఎన్నో కష్టాలు ఎదురైనా ఎంతో పట్టుదలగా చదువుకున్నారని, ఆయన ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరు స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎ.ఓ వీరబద్రప్ప , బి.సి సంక్షేమ శాఖ ఇంచార్జ్ అధికారిణి శ్వేత ప్రియదర్శిని, జెడ్పి సి. ఈ. ఓ కాంతమ్మ, ఎస్సి కార్పోరేషన్ ఈడి రమేష్ బాబు, డి.వై.ఎస్.ఓ బి.ఎస్ ఆనంద్, కలెక్టరేట్ సిబ్బంది, వార్డెన్లు తదితరులు పాల్గొన్నారు.

## రిజర్వేషన్లపై అమిత్ షా కీలక ప్రకటన

**మొదటి పేజీ తరువాయి...**

ఎప్పటికీ రద్దు చేయదని స్పష్టం చేశారు. కాంగ్రెస్‌ను కూడా ఆ పనిచేయనీయబోమని చెప్పారు. ఆదివారం(ఏప్రిల్14) ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన ఎన్నికల ప్రచార సభలో అమిత్ షా మాట్లాడారు.'బీజేపీ రాజకీయాలు చేసినంత కాలం రిజర్వేషన్లకు ఏమీ కానివ్వదు. గత కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన మహదేవ్ బెట్టింగ్ యాప్ స్కామ్‌ను దృష్టిలో ఉంచుకుని ఆ కోపంతో కమలం గుర్తుపై ఓటు వేయండి' అని ఛత్తీస్‌గఢ్ ప్రజలకు అమిత్ షా పిలుపునిచ్చారు.



## అంబేద్కర్‌ను ఆదర్శంగా తీసుకొని యువత మార్పు తీసుకురావాలి

### మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు

హైదరాబాద్ : భారత రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్ అంబేద్కర్ బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. అంబేద్కర్ జయంతిని పురస్కరిం చుకొని ఆదివారం సంగారెడ్డిలో అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంటరానితనం, వివక్షలపై అలుపెరుగని పోరాటం చేసిన గొప్ప యోధుడు అంబేద్కర్ అన్నారు.అంబేద్కర్‌ను యువత ఆదర్శంగ తీసుకొని మార్పు తీసుకురావాలని సూచించారు. దేశాభివృద్ధిలో అంబేద్కర్ పాత్ర విస్మరించలేనిదన్నారు. దేశానికి ఆయన చేసిన సేవలు వెలకట్టలేనివని కొనియాడారు. ఆయన చూపిన మార్గంలో మనందరం పయనించడమే ఆ మహనీయుడికి మనమిచ్చే అసలైన నివాళని పేర్కొన్నారు.



## కర్ణాటక లోక్‌సభ బరిలో ముగ్గురు మాజీ సీఎంలు

బెంగళూరు, ఏప్రిల్ 14 (ప్రభాత ఉదయం): కర్ణాటక లోక్‌సభ బరిలో ముగ్గురు మాజీ సీఎంలు బరిలో నిలిచారు. ఎన్డీయే కూటమి అభ్యర్థులుగా మాజీ సీఎంలు బసవరాజ్ బొమ్మై, జగదీశ్‌శెట్టర్, హెచ్‌డీ కుమారస్వామి లోక్‌సభ ఎన్నికల్లో పోటీచేస్తున్నారు. హావేరి నుంచి బొమ్మై, బెళగావి నుంచి శెట్టర్, మండ్య నుంచి కుమారస్వామి బరిలో నిలిచారు. వీరిలో బొమ్మై, శెట్టర్ లింగాయత్ సామాజిక వర్గానికి చెందినవారు కాగా, కుమారస్వామి వొక్కలిగ వర్గానికి చెందినవారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి కర్ణాటకకు ఇప్పటి వరకు 23 మంది ముఖ్యమంత్రులుగా పనిచేస్తే అందులో 14 మంది పార్లమెంట్‌కు ప్రాతినిథ్యం వహించడం విశేషం. వీరిలో ఏడు మంది రాష్ట్ర రాజకీయాల నుంచి వైదొలగి జాతీయ రాజకీయాల్లో రాణించారు. మళ్లీ కేంద్రంలో ఎన్డీయే సర్కారు ఏర్పడితే.. బొమ్మై కూడా గెలిస్తే మోదీ మంత్రివర్గంలో ఆయనకు స్థానం లభించే అవకాశం ఉందని బీజేపీ వర్గాలు తెలిపాయి. వ్యవసాయ మంత్రి పదవి చేపట్టాలని ఉందని కుమారస్వామి ఇప్పటికే పేర్కొన్నారు.

## కవితతో కేటీఆర్ ములాఖత్

**మొదటి పేజీ తరువాయి...**

వాంగ్మూలాలు, వాట్సాప్ చాట్స్‌పై కవితను సీబీఐ ప్రశ్నిస్తోంది. కవిత విచారణను సీబిఐ వీడియో రికార్డు చేస్తోంది. ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసులో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై సీబీఐ ప్రశ్నల వర్షం కురిపించింది. అసలు ఈ లిక్కర్ స్కాంలోకి ఎవరి ప్రోద్బలంతో వచ్చారనే ప్రశ్నతో సీబీఐ శనివారం విచారణను ప్రారంభించింది. ఈ స్కాంలో ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, ఇతర ఆప్ నేతలు, హైదరాబాద్‌కు చెందిన వ్యాపార వేత్త అరుణ్ పిళ్లై, పారిశ్రామిక వేత్త శరత్‌చంద్రరెడ్డి, మాగుంట శ్రీనివాసులు రెడ్డి, సమీర్ మహేంద్రు, విజయ్‌నాయర్, దినేష్‌ల పాత్రపై, వీరికి కవితతో ఉన్న సంబంధాలు, ఆర్థిక లావాదేవీలపై కవితను విచారించింది. రూ.100 కోట్ల నగదు చేతులు మారిందని, దీన్ని గోవా ఎన్నికల్లో ఖర్చు చేశారని, ఎవరెవరు ఎంత ఇచ్చారు, ఎంత అందుకున్నారు అనే అంశాలను శుక్రవారం సీబీఐ కోర్టుకు తెలిపింది. వీటిపైనా శనివారం సీబీఐ కవితను ప్రశ్నించింది.

## కాంగ్రెస్‌లోకి ఎవరు వచ్చినా చేర్చుకుందాం

**మొదటి పేజీ తరువాయి...**

కేసీ వేణుగోపాల్ సూచించారు. ఈ సమావేశానికి సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, కొండా సురేఖ, సీతక్క, పొన్నం ప్రభాకర్, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి దీపాదాస్ మున్షి, లోక్‌సభ అభ్యర్థులు హాజరయ్యారు. అభ్యర్థులను ప్రకటించాల్సి ఉన్న హైదరాబాద్, ఖమ్మం, కరీంనగర్ స్థానాలపై కూడా చర్చ జరిగినట్టు తెలుస్తోంది.

## ఓటు నమోదుకు లాస్ట్ ఛాన్స్

**మొదటి పేజీ తరువాయి...**

ఓటరుగా నమోదు చేసుకునే అవకాశాన్ని ఎన్నికల సంఘం కల్పిస్తోంది. ఈలోగా దరఖాస్తు చేసిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కును కల్పించనుంది. ఆ తరువాత నమోదు చేసుకునే వారికి మాత్రం రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటు వేసే అవకాశం లభించదు. జిల్లాల్లో ఎన్నికల అధికారులు ఓటరు నమోదు కార్యక్రమంలో నిమగ్నమై ఉన్నారు. వీలైనంత ఎక్కువ మందికి కొత్తగా ఓటు హక్కు కల్పించే లక్ష్యంతో ఎన్నికల అధికారులు క్షేత్రస్థాయిలో పని చేస్తున్నారు. అందుకు అనుగుణంగా అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. గడువులోగా వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, విచారించిన అనంతరం వారిని అనుబంధ ఓటర్ల జాబితాలో చేర్చనున్నట్టు ఎన్నికల అధికారులు చెబుతున్నారు.

ఓటరుగా పేరు నమోదు చేసుకోవడానికి ఏ కార్యాలయానికి, అధికారి వద్దకో తిరగాల్సిన అవసరం కూడా లేదు. ఇంటి వద్ద ఉంటూనే ఓటు నమోదు చేసుకోవచ్చు. కంప్యూటర్, ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్.. ఏది ఉన్నా క్షణాల్లోనే పేరు నమోదు చేసుకోవడం ద్వారా ఓటు పొందవచ్చు. అందుకు అవసరమైన వివరాలను అందిస్తే సరిపోతుంది. ఓటు హక్కు పొందడానికి పూర్తి వివరాలు, ఫటో, పుట్టిన తేదీని నిర్ధారించే పత్రాలు, చిరునామా, ఆ చిరునామాలో ఉంటున్నట్టుగా నిర్ధారించే పత్రాలు(డిజిల్ ఫార్మాట్‌లో ఉండాలి) ఉంటే సరిపోతుంది. 2006 మార్చి 31లోపు జన్మించిన వారెవరైనా కొత్త ఓటు పొందేందుకు అర్హులుగా అధికారులు చెబుతున్నారు. కొత్తగా ఓటు హక్కు నమోదు చేసుకోవడానికి ఫారం 6ను ఎంచుకోవాల్సి ఉంటుందని అధిఆరులు చెబుతున్నారు. ఓటు హక్కు నమోదు కోసం ఎన్నికల కమిషన్ అధీకృత వెబ్‌సైట్‌లోకి మాత్రమే వెళ్లాల్సి ఉంటుంది. అదే సమయంలో ఓటర్ హెల్ప్‌లైన్ యాప్‌లోనూ దరఖాస్తు చేసుకోవచ్చు. మీ మొబైల్‌లో లేదా కంప్యూటర్‌లో https://voters.eci.gov.in టైప్ చేయాలి. వెబ్‌సైట్‌లో కుడివైపు పై భగంలో లాగిన్, సైన్ అప్ అనే రెండు ఆప్షన్లు ఉంటాయి. ఖాతా లేకపోతే సైన్ అప్ అనే ఆప్షన్ ఎంచుకోవాలి. ఖాతాను సృష్టించుకున్న తరువాత లాగిన్ కావాల్సి ఉంటుంది. ఇలా చేయడం ద్వారా ఓటు నమోదు ప్రక్రియను పూర్తి చేయవచ్చు. మొబైల్ నెంబర్ లేదా ఈ మెయిల్ ఐడీ, పాస్ వర్డ్, క్యాప్చా కొట్టిన తరువాత ఓటీపీ వస్తుంది. దానిని ఎంటర్ చేస్తే వెబ్‌పేజ్ ఓపెన్ అవుతుంది. దానిలో ఫాం 6ను క్లిక్ చేసి దరఖాస్తు పూర్తి చేయాలి. వివరాలు పూర్తి చేసే క్రమంలో పాస్‌పర్టు సైజ్ ఫొటో, పుట్టిన తేదీని నిర్ధారించే పత్రాలు, చిరునామా ధృవీకరణ పత్రాలు డిజిటల్ ఫార్మాట్‌లో సమర్పించాల్సి ఉంటుంది. ఒక్కో ఫైల్ సైజు 2 ఎంబీని మించకుండా చూసుకోవాలి. దరఖాస్తులో అడిగిన వివరాలను పూర్తి చేస్తూ ముందుకు వెళితే సరిపోతుంది.



శంషాబాద్ లో నాన్ డ్యూటీ పేయిడ్ మద్యాన్ని స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ పోలీసులు

## ఫామ్ హౌస్‌లో జరుగుతున్న పార్టీలో 22 నాన్ డ్యూటీ పేయిడ్ మద్యం బాటిళ్లు స్వాధీనం

బుద్వేల్, ఏప్రిల్14 (ప్రభాత ఉదయం): శంషాబాద్ అవిన్యా సంఘి ఫామ్ హౌస్ లో మద్యం సేవించడానికి అనుమతి తీసుకున్న నిర్వాహకులు నాట్ డ్యూటీ పేయిడ్ మద్యం బాటిళ్లు కలిగి ఉండడంతో శంషాబాద్ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ గంద్ర దేవేందర్ రావు నేతృత్వంలో ఆదివారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 22 మద్యం బాటిల్లును స్వాధీనం చేసుకున్నారు. ఇవన్నీ నాన్ డ్యూటీ పేయిడ్ మద్యం బాటిళ్ళు అని ఎక్సైజ్ పోలీసులు తెలిపారు . బ్యాచిలర్ పార్టీ కోసం పరిమిషన్ తీసుకున్న మలక్ పేట్ కు చెందిన రిషబ్ తో పాటు ఫామ్ హౌస్ యజమాని ప్రేమ్ సంఘి, సూపర్వైజర్ నరసింహ, అసిస్టెంట్ జ్యోతి దేభాస్కర్ లపై కేసులను నమోదు చేయడం జరిగిందని తెలిపారు.



## అంబేద్కర్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలి

గద్వాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 14(ప్రభాత ఉదయం)బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఎనలేని కృషి చేసిన మహనీయుడు భారతరత్న డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ అని జిల్లా కలెక్టర్ బి.ఎం. సంతోష్ అన్నారు. ఆదివారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా షెడ్యూలు కులముల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 133వ జయంతి వేడుకలకు జిల్లా అదనపు కలెక్టర్ అపూర్వ చౌహాన్ తో కలిసి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బడుగు, బలహీన, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం భారత రాజ్యాంగాన్ని రూపకల్పన చేసి అందరికీ సమాన హక్కులు కల్పించిన మహోన్నత వ్యక్తి అంబేద్కర్ అని అన్నారు. మహిళల హక్కుల కోసం, వారి చదువు కోసం అంబేద్కర్ ఎంతో కృషి చేశారని అన్నారు. ఆయన చదువుకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చారని, ఎన్నో కష్టాలు ఎదురైనా ఎంతో పట్టుదలగా చదువుకున్నారని, ఆయన ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరు స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎ.ఓ వీరబద్రప్ప , బి.సి సంక్షేమ శాఖ ఇంచార్జ్ అధికారిణి శ్వేత ప్రియదర్శిని, జెడ్పి సి. ఈ. ఓ కాంతమ్మ, ఎస్సి కార్పోరేషన్ ఈడి రమేష్ బాబు, డి.వై.ఎస్.ఓ బి.ఎస్ ఆనంద్, కలెక్టరేట్ సిబ్బంది, వార్డెన్లు తదితరులు పాల్గొన్నారు.

## స్టేషన్‌ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే రాజయ్యకు కేసీఆర్ కీలక బాధ్యతలు

గజ్వేల్, ఏప్రిల్ 14 (ప్రభాత ఉదయం): బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌తో స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య ఆదివారం(ఏప్రిల్14) భేటీ అయ్యారు. ఎర్రవెల్లిలోని ఫామ్‌హౌజ్‌లో జరిగిన ఈ భేటీ సందర్భంగా రాజయ్యకు స్టేషన్‌ఘన్‌పూర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇంఛార్జ్ బాధ్యతలను కేసీఆర్ అప్పగించారు. పార్లమెంట్ ఎన్నికల్లో వరంగల్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి మారేపల్లి సుధీర్‌కుమార్ గెలుపు కోసం కృషి చేయాలని ఈ సందర్భంగా రాజయ్యకు కేసీఆర్ సూచించారు. కాగా, వరంగల్ బీఆర్ఎస్ ఎంపీ సీటును కేసీఆర్ రాజయ్యకే ఇస్తారని ప్రచారం జరిగినప్పటికీ చివరి నిమిషంలో సుధీర్‌కుమార్‌కు కేటాయించారు. అయినా స్టేషన్‌ఘన్‌పూర్ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఉన్న కడియం శ్రీహరి కూతురు కావ్యతో కలిసి కాంగ్రెస్‌లోకి వెళ్లడంతో స్టేషన్‌ఘన్‌పూర్ ఇంఛార్జ్ బాధ్యతల కోసం రాజయ్య తిరిగి బీఆర్ఎస్‌లోకి వచ్చినట్లు చెబుతున్నారు. తాను బీఆర్ఎస్‌ను వీడుతున్నట్లు అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత రాజయ్య ప్రకటించిన విషయం తెలిసిందే.

# రాజేంద్రనగర్‌లో ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు


రాజేంద్రనగర్ లో జరిగిన అంబేద్కర్ జయంతి వేడుకల్లో ప్రసంగిస్తున్న తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్


అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న శాసనసభ అధిపతి గడ్డం ప్రసాద్ కుమార్, చేవెళ్ల కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ గడ్డం రంజిత్ రెడ్డి , బి. జ్ఞానేశ్వర్ ముదిరాజ్ లు


అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న రాజేంద్రనగర్ ఏసిపి టి శ్రీనివాస్, ఇన్స్పెక్టర్ బి నాగేంద్రబాబులు


అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మహిళా నాయకురాలు ఎం యాదమ్మ యాదవ్ తదితరులు


అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న నవజ్యోతి యూత్ క్లబ్ మాజీ అధ్యక్షుడు పి ఈశ్వర్, నాయకులు పి వెంకటస్వామి


అంబేద్కర్ చిత్రపటానికి నివాళు లర్పిస్తున్న టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎం. రామేశ్వర్ రావు


ఎర్ర బోడలో అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కొలన్ సుభాష్ రెడ్డి, మ్యాడం మధుసూదన్, ఎం. కొమురయ్య లు


నివాళులు అర్పిస్తున్న బీజేపీ నాయకులు


మాట్లాడుతున్న మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎ. సదాలక్ష్మి


ఓటును అమ్ముకోము అని సభకు వచ్చిన వారి చేత ప్రతిజ్ఞ చేయిస్తున్న సదాలక్ష్మి

బుద్వేల్, ఏప్రిల్14(ప్రభాత ఉదయం): యువత అంబేద్కర్ జయంతి, వర్ధంతిలకే పరిమితం కావద్దని, దళితజాతి బాగోగుల కోసం నిరంతరం శ్రమించాలని తెలంగాణ రాష్ట్ర శాసనసభ అధిపతి గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. రాజేందర్‌నగర్‌లో ఆదివారం జరిగిన భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న బాబా సాహెబ్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 133వ జయంతి వేడుకల్లో ఆయన చేవెళ్ల కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ గడ్డం రంజిత్ రెడ్డి , తెలంగాణ రాష్ట్ర డైరీ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ బి. జ్ఞానేశ్వర్ ముదిరాజ్ లతో కలిసి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనలో దళితులకు మంచి రోజులు రానున్నాయన్నారు. రాజేంద్రనగర్ లో దళితుల అవసరాలను తీర్చడానికి తన వంతు ప్రయత్నం చేస్తానన్నారు.

### దళితుల అండగా నిలబడతా : డాక్టర్ గడ్డం రంజిత్ రెడ్డి

దళితులకు తాను అండగా నిలబడతానని చేవెళ్ల పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ గడ్డం రంజిత్ రెడ్డి అన్నారు. రాజేంద్రనగర్ లో జరిగిన అంబేద్కర్ జయంతి వేడుకల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. కాంగ్రెస్ పార్టీ ద్వారానే అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం జరుగుతుందన్నారు.

### ఓట్లు అమ్ముకోవద్దని ప్రతిజ్ఞ చేయించిన సదాలక్ష్మి :

పేదలు, బడుగు , బలహీన వర్గాల ప్రజలు ఓట్లను అమ్ముకోవద్దని మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ – బాబు జగ్జీవన్ రామ్ జయంతి ఉత్సవాల కమిటీ మాజీ అధ్యక్షురాలు కుమారి ఎ. సదాలక్ష్మి కోరారు. జయంతి ఉత్సవాలలో రాజకీయ నాయకులకు వత్తాసు పలకవద్దన్నారు. జాతి ప్రజల కోసం ప్రాధాన్యత ఇచ్చే వారికి ప్రథమ స్థానం ఇవ్వాలన్నారు. మన అభివృద్ధిని కోరుకునే వాళ్లకి అండగా నిలవాలని సూచించారు.


అంబేద్కర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న మైలార్ దేవ్ పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి

## అంబేద్కర్ విగ్రహానికి నివాళులు

బుద్వేల్, ఏప్రిల్14(ప్రభాత ఉదయం): రాజేంద్రనగర్ అంబేద్కర్ చౌరస్తాలో, బుద్వేల్‌లో బహుజన వర్గాల ఆశాజ్యోతి, న్యాయ కోవిదుడు, భారత రాజ్యాంగ నిర్మాత, బహుముఖ ప్రజ్ఞాశాలి, భారతరత్న “డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ 133 వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో రాజేంద్ర నగర్ నియోజక కాంటెస్టడ్ ఎమ్మెల్యే , మైలార్ దేవ్ పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. పార్టీ నాయకులతో కలిసి అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ అంటరానితనం, వివక్ష ల పై అలుపెరుగని పోరు చేసిన మహనీయులు అంబేద్కర్ అని కొనియాడారు. దేశానికి ఆయన చేసిన సేవలు చిరస్మణీయన్నారు. ప్రతి ఒక్కరూ కుల మాత పార్టీ లకు అతీతంగా యువత, యువకులు, విద్యార్థులు, మేధావులు, కవులు, కళాకారులు, ఆ మహనీయుని ఆశయ సాధనకు పునరకింతం అవుదామని తెలిపారు. . ఈ కార్యక్రమంలో ఉత్సవా కమిటి సభ్యులు , కార్యకర్తలు అభిమానులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొనడం జరిగింది.



## అంబేద్కర్ జీవితం అందరికీ ఆదర్శం

### అంబేద్కర్ ఆశయాలను కొనసాగిద్దాం.. అంబేద్కర్‌కు ఘన నివాళి.. వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎం.వెంకటరమణ



రాజేంద్రనగర్,ఏప్రిల్ 14(ప్రభాత ఉదయం): భారత రాజ్యాంగ పితామహుడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 134 వ జయంతిని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు.వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిపాలన భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎం.వెంకటరమణ హాజరయ్యారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి పూలదండ వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం అంబేద్కర్ సేవలని రిజిస్ట్రార్ కొనియాడారు. అంబేద్కర్ మతానికి జాతికి చెందిన వ్యక్తికాదని, సమాజహితంకోసం పాటుపడిన మహోన్నతవ్యక్తి అన్నారు.అంబేద్కర్ ఆశయాలను కొనసాగిద్దామన్నారు.ఈ వేడుకల్లో వ్యవసాయ విశ్వవిద్యాలయ ఉన్నతాధికారులు,బోధన, బోధనేతర సిబ్బంది, ఆయా సంఘాల నాయకులు బి.ఆర్ అంబేద్కర్ హాజరై చిత్రపటం వద్ద పుష్పాంజలి ఘటించారు.


కిస్మత్ పూర్ లో కుట్టు మిషన్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ నిఖిల సంగారెడ్డి

## మహిళలు ఆసక్తి ఉన్న రంగాల్లో రాణించాలి

### కార్పొరేటర్ నిఖిల సంగారెడ్డి

బండ్లగూడ, ఏప్రిల్ 14(ప్రభాత ఉదయం) మహిళలు తమకు ఆసక్తి ఉన్న రంగాలలో శిక్షణ పొంది ఆర్థికంగా ఎదగాలని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్ లంకల నిఖిలా సంగారెడ్డి సూచించారు. ఆదివారం లంకల నిఖిల సంగారెడ్డి ఆధ్వర్యంలో కిస్మత్పూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్థానిక మహిళల కోసం ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిక్షణా శిబిరాన్ని ఆదివారం ఆమె ప్రారంభించారు. గ్రామానికి చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో ఈ శిక్షణ శిబిరంలో పాల్గొనేందుకు తమ పేరు నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... మహిళలకు తన వంతు ప్రోత్సాహంగా ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కుట్టు శిక్షణకు కావలసిన సామాగ్రినంత ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు. కుట్టు శిక్షణాలో ప్రతిభ చూపిన మహిళలను గుర్తించి తానే స్వయంగా కుట్టుమిషన్లను అందజేయనున్నట్టు వెల్లడించారు. మహిళలు తమకు ఆసక్తి ఉన్న రంగాలలో రాణించేందుకు తన శాయ శక్తుల కృషి చేస్తానని వెల్లడించారు. ఈ శిక్షణా శిఖరం రెండు నెలల పాటు కొనసాగనున్నట్టు తెలిపారు ఉదయం సాయంత్రం రెండు బ్యాచ్ లలో ఈ శిక్షణ సాగుతుందని వెల్లడించారు.



అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన చేవెళ్ల పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి, నాయకులు


## నిజమైన ప్రజా నాయకుడు అంబేద్కర్

### కొండా విశ్వేశ్వర్ రెడ్డి

బుద్వేల్, ఎప్రిల్ 14 (ప్రభాత ఉదయం): బాబా సాహెబ్ అంబేద్కర్ నిజమైన ప్రజానాయకుడని చేవెళ్ల పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు. అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని రాజేంద్రనగర్ ఎక్స్ రోడ్ లో ఆదివారం నిర్వహించిన వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొండా విశ్వేశ్వర్ రెడ్డి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కొండా విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, అంబేద్కర్ మార్గం అందరికీ ఆచరణీయం అన్నారు. అంబేద్కర్ ఆలోచనలు ఆయన రాసిన రాజ్యాంగంలోని ఆర్టికల్ 3 ఆధారంగానే తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందని కొండా విశ్వేశ్వర్ రెడ్డి గుర్తు చేశారు. ఇవాల్టికి దేశంలో ప్రజలంతా హక్కుల తో జీవిస్తున్నారంటే దానికి కారణం అంబేద్కర్ రాసిన రాజ్యాంగమేనని కొనియాడారు. అమెరికా ఇంగ్లాండ్ లాంటి దేశాల్లో గొప్ప గొప్ప చదువులు చదివిన అంబేద్కర్ తన విజ్ఞానం, మేథస్సు ను కలిపి భారత రాజ్యాంగాన్ని రూపొందించారని కొండా విశ్వేశ్వర్ రెడ్డి తెలిపారు. అయితే కేసీఆర్ లాంటి కొంతమంది స్వార్థ పూరిత నాయకులు భారత రాజ్యాంగాన్ని మారుస్తామంటూ తమ సంకుచిత బుద్ధిని బయట పెట్టుకున్నారని గుర్తు చేశారు. అలాంటివారికి ప్రజలు ఎలా బుద్ధి చెబుతారో గత ఎన్నికల్లో చూసామన్నారు. కాంగ్రెస్ పార్టీ కూడా అంబేద్కర్ కు సరైన గౌరవం ఇవ్వకుండా ఆయన విలువలను, ఆశయాలను విస్మరించిందని కొండా విశ్వేశ్వర్ రెడ్డి విమర్శించారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ నియోజకవర్గానికి చెందిన బిజెపి సీనియర్ నాయకులు, కొండా విశ్వేశ్వర్ రెడ్డి అనుచరులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అతివేగంతో కారు నడిపి డివైడర్‌ను ఢీ కొనడంతో ఇద్దరు అక్కడికక్కడే మృతి.. ముగ్గురికి గాయాలు


హిమాయత్ సాగర్ ఔటర్ రింగ్ రోడ్డు పై జరిగిన ప్రమాదంలో మరణించిన యువకులు


ప్రమాదంలో నుజ్జు నుజ్జు అయిన కారు


ప్రమాదంలో గాయపడిన తనూజ

బుద్వేల్, ఏప్రిల్ 14 (ప్రభాత ఉదయం): హిమాయత్ సాగర్ ఔటర్ రింగ్ రోడ్ పై ఆదివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు సాఫ్ట్వేర్ ఇంజనీర్లు దుర్మరణం పాలయ్యారు. ఈ ప్రమాదంలో మరో ముగ్గురు గాయపడ్డారు. గాయపడ్డ వారిలో ఓ యువతి కూడా ఉంది. అతివేగమే ఈ ప్రమాదానికి కారణమని తెలుస్తోంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఈ విధంగా ఉ న్నాయి..... గచ్చిబౌలిలో సాఫ్ట్వేర్ ఇంజనీర్లుగా పనిచేస్తు అదే ప్రాంతంలో హాస్టల్లో నివాసం ఉంటున్న కాకినాడకు చెందిన గౌతం సాయి( 24 ), ఆనంద్ ( 31) లతో పాటు తనూజ, ప్రకాష్, సూర్యతేజ లు శనివారం సాయంత్రం గచ్చిబౌలి నుంచి శంషాబాద్ లో గల గేమింగ్ జోన్ గో కాటిగ్ కు వెళ్లారు. అక్కడి నుంచి ఆదివారం తెల్లవారుజామున తిరిగి గచ్చిబౌలికి వస్తున్నారు. కారు ను సూర్యతేజ నడిపిస్తున్నాడు. అతివేగంగా కారు నడపడంతో హిమాయత్ సాగర్ ఔటర్ రింగ్ రోడ్డు వద్ద డివైడర్ను ఢీకొట్టాడు . ఈ ప్రమాదంలో కారు ఐదు పల్టీలు కొట్టింది . కారులో ఉన్న గౌతమ్ సాయి, ఆనంద్ లు అక్కడికక్కడే మరణం చెందారు . తనూజ, ప్రకాష్ కారు నడుపుతున్న సూర్య తేజ తీవ్రంగా గాయపడ్డారు. వారిని పోలీసులు శంషాబాద్ లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. మృతి చెందిన వారిని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తీసుకువెళ్లారు. కారు పాండిచ్చేరి రిజిస్ట్రేషన్ తో ఉందని పోలీసులు తెలిపారు.

# 'చాంపియన్స్' సమరంలో చెన్నైదే విజయం

**20 పరుగులతో ఓడిన ముంబై**
**మెరిపించిన రుతురాజ్, దూబే, ధోని**
**4 వికెట్లతో పతిరణ విజృంభణ**
**రోహిత్ శర్మ శతకం వృథా**





ముంబై: ఐపీఎల్ 'ఫైవ్ స్టార్' చాంపియన్ల సమరంలో ముంబై ఇండియన్స్‌పై డిఫెండింగ్ చాంపియన్ చెన్నై సూపర్‌కింగ్స్ (సీఎస్‌కే) పైచేయి సాధించింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' పతిరణ (4/28) తన పేస్‌తో ముంబైని కోలుకోలేని దెబ్బ తీశాడు. తొలుత బ్యాటింగ్ చేపట్టిన చెన్నై 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 206 పరుగుల భారీస్కోరు చేసింది. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ (40 బంతుల్లో 69బీ 5 ఫోర్లు, 5 సిక్స్‌లు), శివమ్ దూబే (38 బంతుల్లో 66బీ 10 ఫోర్లు, 2 సిక్స్‌లు) దంచేశారు. అనంతరం ముంబై 20 ఓవర్లలో 6 వికెట్లకు 186 పరుగులే చేసి ఓడింది. రోహిత్ శర్మ (63 బంతుల్లో 105 నాటౌట్‌బీ 11 ఫోర్లు, 5 సిక్స్‌లు) తన టి20 కెరీర్‌లో ఎనిమిదో శతకం చేసినా ఫలితం లేకపోయింది.

### దూబే, రుతురాజ్ ఫిఫ్టీ-ఫిఫ్టీ

ఓపెనర్ రహానే (5) అవుటయ్యాక రచిన్ రవీంద్రకు జతయిన కెప్టెన్ రుతురాజ్ ఇన్నింగ్స్‌ను ముందుకు తీసుకెళ్లాడు. పవర్‌ప్లేలో 48/1 స్కోరు చేయగా... కాసేపటికి రచిన్ (16 బంతుల్లో 21బీ 2 ఫోర్లు, 1 సిక్స్) నిష్క్రమించాడు. శివమ్ దూబే వచ్చాక చెన్నై స్కోరు, జోరు పెరిగాయి.

దూబే బౌండరీలతో, రుతురాజ్ భారీ సిక్సర్లతో విరుచుకుపడటంతో 12వ ఓవర్లో చెన్నై స్కోరు 100 దాటింది. ముందుగా గైక్వాడ్ 33 బంతుల్లో, తర్వాత దూబే 28 బంతుల్లో ఫిఫ్టీలు పూర్తి చేసుకున్నారు. హార్దిక్ బౌలింగ్‌లో రుతురాజ్ అవుటవడంతో మూడో వికెట్‌కు 90 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. మిచెల్ (17) పెద్దగా మెరిపించలేదు.

### ధోని 6,6,6,2....

ప్రేక్షకుల కరతాళధ్వనుల మధ్య ఆఖరి ఓవర్లో బ్యాటింగ్‌కు దిగిన ధోని... చెన్నై ఇన్నింగ్స్‌నే కాదు తన మునుపటి శైలి సిక్సర్లతో మొత్తం వాంఖేడేను మోతెక్కించాడు. 20వ ఓవర్‌లో మిగిలిపోయిన 4 బంతుల్ని ఆడిన ధోని వరుసగా 6, 6, 6, 2లుగా బాదేయడంతో హార్దిక్ పాండ్యా వేసిన ఈ ఓవర్లో మొత్తం 26 పరుగులు వచ్చాయి.

### రోహిత్ ఒక్కడే...

లక్ష్యానికి తగిన వేగాన్ని ఆరంభం నుంచి జతచేసిన ముంబై ఓపెనర్లు ఇషాన్ (15 బంతుల్లో 23బీ 3 ఫోర్లు, 1 సిక్స్), రోహిత్‌లు పవర్ ప్లే (63/0)లో ఓవర్‌కు పది పరుగుల చొప్పున సాధించారు. కానీ 8వ ఓవర్ వేసిన పతిరణ తొలి బంతికి కిషన్‌ను, మూడో బంతికి హిట్టర్ సూర్య (0)ను అవుట్ చేసి చెన్నై శిబిరాన్ని ఆనందంలో ముంచాడు.

కానీ అవతలివైపు రోహిత్ 30 బంతుల్లో అర్ధసెంచరీ సాధించాడు. తిలక్ వర్మ (20 బంతుల్లో 31బీ 5 ఫోర్లు) వేగానికీ పతిరణే కళ్లెం వేశాడు. హార్దిక్ (2) వచ్చివెళ్లగా, రెండు సిక్సర్లతో ఇన్నింగ్స్‌కు ఊపు తెచ్చిన డేవిడ్ (13), షెఫర్డ్ (1) వెంటవెంటనే అవుట్ కాగానే ముంబై ఆశలు ఆవిరయ్యాయి.

### స్కోరు వివరాలు

చెన్నై సూపర్‌కింగ్స్ ఇన్నింగ్స్: రహానే (సి) పాండ్యా (బి) కొయెట్జీ 5బీ రచిన్ (సి) ఇషాన్ (బి) శ్రేయస్ గోపాల్ 21బీ రుతురాజ్ (సి) నబీ (బి) పాండ్యా 69బీ దూబే (నాటౌట్) 66బీ మిచెల్ (సి) నబీ (బి) పాండ్యా 17బీ ధోని (నాటౌట్) 20బీ ఎక్స్‌ట్రాలు 8బీ మొత్తం (20 ఓవర్లలో 4 వికెట్లకు) 206. వికెట్ల పతనం: 1-8, 2-60, 3-150, 4-186. బౌలింగ్: నబీ 3-0-19-0, కొయెట్జీ 4-0-35-1, బుమ్రా 4-0- 27-0, ఆకాశ్ 3-0-37-0, శ్రేయస్ గోపాల్ 1-0- 9-1, పాండ్యా 3-0-43-2, రొమరియో షెఫర్డ్ 2-0-33-0.

ముంబై ఇండియన్స్ ఇన్నింగ్స్: రోహిత్ (నాటౌట్) 105బీ ఇషాన్ కిషన్ (సి) శార్దుల్ (బి) పతిరణ 23బీ సూర్యకుమార్ (సి) ముస్తఫిజుర్ (బి) పతిరణ 0బీ తిలక్ వర్మ (సి) శార్దుల్ (బి) పతిరణ 31బీ హార్దిక్ (సి) జడేజా (బి) తుషార్ 2బీ టిమ్ డేవిడ్ (సి) రవీంద్ర (బి) ముస్తఫిజుర్ 13బీ షెఫర్డ్ (బి) పతిరణ 1బీ నబీ (నాటౌట్) 4బీ ఎక్స్‌ట్రాలు 7బీ మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు) 186. వికెట్ల పతనం: 1-70, 2-70, 3-130, 4-134, 5-148, 6-157. బౌలింగ్: తుషార్ 4-0-29-1, ముస్తఫిజుర్ 4-0-55-1, శార్దుల్ 4-0-35-0, జడేజా 4-0-37-0, పతిరణ 4-0-28-4.



# ధోని హ్యాట్రిక్ సిక్స్‌లు..
## దద్దరిల్లిన స్టేడియం

ఐపీఎల్-2024లో చెన్నై సూపర్ కింగ్స్ స్టార్ క్రికెటర్ ఎంస్ ధోని మరోసారి ఫినిషర్ అవతరమెత్తాడు. ఈ మెగా ఈవెంట్‌లో భాగంగా వాంఖడే వేదికగా ముంబై ఇండియన్స్‌తో మ్యాచ్‌లో ధోని మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. హార్దిక్ పాండ్యా వేసిన ఆఖరి ఓవర్‌లో బ్యాటింగ్‌కు వచ్చిన ధోని వరుసగా హ్యాట్రిక్ సిక్స్‌లు బాది ఔరా అనిపించాడు. తన ఎదుర్కొన్న తొలి బంతిని లాంగాఫ్ మీదగా భారీ సిక్సర్ బాదిన మిస్టర్ కూల్, ఆ తర్వాత బంతులను లాంగాన్, డీప్ స్క్వేర్ లెగ్ దిశగా సిక్సర్లుగా మలిచాడు. ఈ మ్యాచ్‌లో కేవలం 4 బంతులు మాత్రమే ఎదుర్కొన్న తలైవా.. మూడు సిక్సర్ల సాయంతో 20 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. ధోని సిక్స్‌లు కొట్టగానే స్టేడియం అభిమానుల అరుపులతో దద్దరిల్లోపోయింది. ధోని బ్యాటింగ్ చూసి ముంబై కెప్టెన్ హార్దిక్ పాండ్యా తెల్లముఖం వేశాడు. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఇది చూసిన నెటిజన్లు క్రికెట్ చరిత్రలోనే బెస్ట్ ఫినిషర్ అంటూ ధోనిపై ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. ఇక ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన సీఎస్‌కే నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 206 పరుగులు చేసింది. సీఎస్‌కే బ్యాటర్లలో శివమ్ దూబే(66 నాటౌట్), రుతురాజ్ గైక్వాడ్(69) హాఫ్ సెంచరీలతో చెలరేగారు. ముంబై బౌలర్లలో హార్దిక్ పాండ్యా రెండు వికెట్లు, కోయిట్జీ, శ్రేయస్ గోపాల్ తలా వికెట్ సాధించారు.



# థ్యాంక్స్ చెప్పకుండా ఉండలేకపోతున్నా..


ఉద్వేగాల్ని మనసులోనే దాచుకుని గుంభనంగా ఉండటం కొందరికి చేతకాదు. త్రిప్తి డిమ్రి ఆ తరహా వ్యక్తే. 'ఆనందమైనా, బాధైనా భావోద్వేగం ఏదైనా అస్సలు దాచుకోలేను' అంటున్నది ఈ అందాలభామ. ప్రముఖ పంజాబీ గాయకుడు అమర్‌సింగ్ జీవితం ఆధారంగా రూపొంది, ఇటీవలే ఓటీటీలో విడుదలైన సినిమా 'అమర్‌సింగ్ చంకీల'. బాలీవుడ్ తారలకోసం ముంబాయిలోని ఓ థియేటర్‌లో ఈ సినిమాను ప్రదర్శించారు. సినిమా చూసిన తారలలో త్రిప్తి డిమ్రీ కూడా ఉంది. ఈ సినిమా చూసి ఉద్వేగాన్ని ఆపుకోలేకపోయింది త్రిప్తి. 'చాలాకాలం తర్వాత నేను చూసిన ఉత్తమ సినిమా ఇది. దర్శకుడు ఇంతియాజ్ అలీని థ్యాంక్స్ చెప్పకుండా ఉండలేకపోతున్నాను. అమర్‌సింగ్‌గా దిల్జిత్ దొసాంజ్ జీవించాడు. అమర్‌జ్యోతిగా పరిణీతి అద్భుతం అనిపించారు. ఓ నిజాయితీగల కళాకారుడి అందమైన, హృదయ విదారకమైన ప్రయాణమే ఈ సినిమా. ప్రేక్షకుల్ని సినిమాలో మమేకమయ్యేలా చేసిన దర్శకుడికి మరోసారి థ్యాంక్స్ చెప్పుకుంటున్నాను.' అంటూ ఆనందం వ్యక్తం చేసింది త్రిప్తి డిమ్రీ.



# 'సోలో బాయ్'గా వస్తున్న గౌతమ్

బిగ్ బాస్ 7 కంటెస్టెంట్ గౌతమ్ కృష్ణ హీరోగా నటిస్తోన్న తాజా చిత్రం సోలో బాయ్. నవీన్ కుమార్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని సెవెన్ హిల్స్ ప్రొడక్షన్స్ పై సెవెన్ హిల్స్ సతీష్ కుమార్ నిర్మిస్తున్నారు. ఏప్రిల్ 14 గౌతమ్ పుట్టిన రోజు. ఈ సందర్భంగా చిత్రబృందం గౌతమ్ బర్త్‌డేని గ్రాండ్‌గా సెలెబ్రేట్ చేసింది. ఈవెంట్లో హీరో గౌతమ్ కృష్ణ, హీరో ఫాదర్ మనోజ్ గారు, సెవెన్ హిల్స్ సతీష్ గారు, డైరెక్టర్ నవీన్ కుమార్ గారు, అనిత చౌదరి గారు, కమెడియన్ భద్రం, పింగ్ పాంగ్( సూర్య ) పాల్గొన్నారు. హీరో గౌతమ్ కృష్ణ మాట్లాడుతూ : నా పుట్టినరోజు పూట మూవీ టీం ఇలా ఈవెంట్ చేయడం చాలా ఆనందంగా ఉంది. ఈ టీమ్ అందరూ కూడా సినిమా మీద ఇష్టంతో పని చేసినవారే. బడ్జెట్ విషయంలో కూడా ఎక్కడ కాంప్రమైజ్ అవ్వకుండా మంచి కంటెంట్ ని తీసుకొస్తున్నాం. అతి త్వరలో టీజర్, ట్రైలర్, సాంగ్స్ తో మీ ముందుకు వస్తాం. ప్రేక్షకులు అందరూ ఈ సినిమాని ఆదరించి మంచి సక్సెస్ చేయాలని కోరుకుంటున్నాను ' అన్నారు. డైరెక్టర్ నవీన్ చెప్పిన కథ చాలా కొత్తగా అనిపించి, ఈ సినిమాను నిర్మించాను. ఈ చిత్రం కచ్చితంగా అందరికి నచ్చుతుంది' అని ప్రొడ్యూసర్ సెవెన్ హిల్స్ సతీష్ కుమార్ అన్నారు. చిన్న సినిమా పెద్ద సినిమాను ఉండదు మంచి సినిమా నే ఉంటుంది. సోలో బాయ్ కూడా ఒక మంచి సినిమా. మా హీరో గౌతమ్ కృష్ణ చాలా బాగా నటించాడు. సాంగ్స్ ఫైట్స్ ఎమోషనల్ సీన్స్ అన్నిటిలోనూ తనదైన శైలితో నటించాడు. ఈ చిత్రం కచ్చితంగా విజయం సాధిస్తుంది' అన్నారు దర్శకుడు పి.నవీన్ కుమార్.

# లోకేష్ కనగరాజ్, లారెన్స్ కాంబినేషన్‌లో సినిమా




కోలీవుడ్‌లో వరుస హిట్లు కొడుతూ దూసుకుపోతున్నాడు లోకేష్ కనగరాజ్.. ఆయన నుంచి సినిమా ప్రకటన వచ్చిందంటే చాలు భారీగా అంచనాలు ఉంటాయి. ఈ క్రమంలో ఖైదీ, విక్రమ్, మాస్టర్ లాంటి సినిమాలతో బాక్సాఫీస్ వద్ద ట్రెండ్ క్రియేట్ చేసి సూపర్ స్టార్ రజనీకాంత్‌తో సినిమా ఛాన్స్ దక్కించుకున్నాడు. తాజాగా లోకేష్ కనగరాజ్ కొత్త సినిమాను ప్రకటించాడు. దానికి టైటిల్ కూడా 'బెంజ్' అని ఫిక్స్ చేశాడు. అందులో రాఘవ లారెన్స్ హీరోగా నటుస్తున్నాడు. అయితే ఈ క్రేజీ సినిమాను లోకేష్ డైరెక్ట్ చేయడం లేదు. కేవలం కథను మాత్రమే అందిస్తున్నాడు. యాక్షన్ థ్రిల్లర్ జోనర్‌లో వస్తున్న ఈ చిత్రాన్ని బక్యరాజ్ కన్నన్ (రెమో) డైరెక్ట్ చేస్తున్నాడు. ఈ సినిమాలో హీరోయిన్ ఉండదట.. లోకేష్ డైరెక్ట్ చేసిన ఖైదీ సినిమాలో కూడా హీరోయిన్ పాత్ర ఉండదు అనే విషయం తెలిసిందే.



# ఫెమినిజంపై నోరా షాకింగ్ కామెంట్స్
## మండిపడుతున్న నెటిజన్స్!

బాలీవుడ్ భామ నోరా ఫతేహీ ఇటీవల మడ్గావ్ ఎక్స్‌ప్రెస్ సినిమాతో ప్రేక్షకులను అలరించింది. బాలీవుడ్ పలు చిత్రాల్లో స్పెషల్ సాంగ్స్‌లో మెరిసిన ముద్దుగుమ్మ ఇటీవల బాలీవుడ్ జంటలపై సంచలన కామెంట్స్ చేసింది. వారంతా కేవలం డబ్బు, పేరు కోసమే పెళ్లిళ్లు చేసుకుంటున్నారని విమర్శించింది. తనకు అలాంటి ఉద్దేశం లేదని.. అందుకే ఎవరితోను డేటింగ్‌లో చేయడం లేదని చెప్పుకొచ్చింది. తాజాగా ఈ బాలీవుడ్ భామ మరోసారి సంచలన కామెంట్స్ చేసింది. ఓ పాడ్‌కాస్ట్‌లో నోరా మాట్లాడుతూ ఫెమినిజంపై విమర్శలు గుప్పించింది. స్త్రీవాదం అనేది సమాజాన్ని పూర్తిగా నాశనం చేసిందని ఆరోపించింది. అది కేవలం మహిళలనే కాకుండా పురుషులను కూడా బ్రెయిన్‌వాష్ చేసిందంటూ షాకింగ్ కామెంట్స్ చేసింది. ఫెమినిజంపై నోరా మాట్లాడుతూ..'ఇలాంటి ఆలోచన ఎవరికీ అవసరం లేదు. స్త్రీవాదమనే ఈ విషయాన్ని నేను అస్సలు నమ్మను. నిజంగా స్త్రీవాదమే మన సమాజాన్ని పూర్తిగా నాశనం చేసింది. మహిళలు పెళ్లి చేసుకోకూడదు. పిల్లలను కనకూడదనే ధోరణిని తాను విశ్వసించను. ఇది పూర్తిగా స్వతంత్రంగా ఉండాలి. ఇక్కడ పురుషులు డబ్బు, ఫుడ్ కోసం పనిచేస్తుంటే.. ఒక స్త్రీ పిల్లలు, ఇల్లు చూసుకోవడం, వంట చేయడం లాంటివి చేస్తున్నారు. మహిళలు బయటకు వెళ్లి పని చేయాలి.. వారు సొంతంగా జీవించాలని కోరుకుంటున్నారు.. కానీ అది కొంత వరకేనని' చెప్పుకొచ్చింది. ప్రస్తుత సమాజంలో చాలా మంది పురుషుల ధోరణి మారింది. ఇప్పుడు చాలా మంది ఫెమినిజం ద్వారా బ్రెయిన్‌వాష్‌కు గురయ్యారంటూ నోరా తెలిపింది. మనమందరం సెంటిమెంట్స్‌లో సమానమే కానీ.. సామాజికపరంగా సమానం కాదని నోరా పేర్కొంది. స్త్రీవాదం అంతర్లీనంగా, ప్రాథమిక స్థాయిలో గొప్పదే.. నేను కూడా మహిళల హక్కుల కోసం వాదిస్తానని.. బాలికలు పాఠశాలకు వెళ్లాలని కోరుకుంటానని తెలిపింది. అయితే, స్త్రీవాదం రాడికల్‌గా మారినప్పుడే సమాజానికి ప్రమాదకరంగా మారుతుందని వెల్లడించింది. అయితే ఫెమినిజం పునాదులు గట్టిగానే ఉన్నప్పటికీ .. గత 20 ఏళ్లలో పోలిస్తే చాలా ప్రమాదకరంగా మారిందని అన్నారు. అయితే నోరా ఫతేహీ చేసిన కామెంట్స్‌పై నెటిజన్స్ మండిపడుతున్నారు. మీ మాటలు చాలా కామెడీగా ఉన్నాయంటూ కామెంట్స్ చేస్తున్నారు. స్త్రీవాదం లేకపోతే ఇండియాలో నీకు పని చేసే అవకాశం లభించేది కాదని అంటున్నారు. అలా అయితే మీరు వెంటనే పని మానేసి పెళ్లి చేసుకోండి.. అలాగే మీరు ఐటెం సాంగ్స్‌లో డ్యాన్స్ చేయకుండా భర్తపైనే ఆధారపడి జీవించండి అంటూ ఓ నెటిజన్ చురకలంటించారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: KOTLA CHANDRA KANTH. "RNI. Title- Code: TELTEL12231**. Cell: 9705231654.